## క్లుప్తంగా

### పారిశుధ్యం మెరుగుకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని కారణి గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆమె కారణి గ్రామంలోని చెత్త సేకరణ కేంద్రం వద్ద గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య, ఏపీఓ దేవరి పాల్గొన్నారు.

### పనితీరు మార్చుకోండి

- సచివాలయ సర్వేయర్లపై తహసీల్దార్ ఆగ్రహం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లు పనితీరు బాగోలేదని, పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీదేవి హెచ్చరించారు. శనివారం ఆమె గ్రామ సచివాలయాల సర్వేయర్లలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వేయర్లు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, దీంతో భూముల సర్వే పనులు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకుంటే కలెక్టరేట్‌కు సరండర్ చేస్తానని హెచ్చరించారు. సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

### పాఠశాల విలీనం రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

**సత్యవేదు:** పేరడం పాఠశాలను మదనంబేడు పాఠశాలలో విలీనం చేస్తున్న చర్యలను రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. శనివారం పేరడం గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సీపీఎం నాయకులు ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు సుశీల, వీరమ్మ, కృష్ణయ్య, మునెమ్మ, లక్ష్మి, మునస్వామి, సెల్వం పాల్గొన్నారు.

### రిటైర్డ్ డీఎంహెచ్ఓ ఔదార్యం



రోడ్డుకు మరమ్మతులు

**కేవీబీపురం:** మండలంలోని కోటమంగాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఎంహెచ్ఓ చంద్రయ్యాయాదవ్ విద్యార్థుల సమస్యను పరిష్కరించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కోటమంగాపురం నుంచి పిచ్చాటూరు, కేవీబీపురం, శ్రీకాళహస్తి మార్గాలకు వెళ్లే కోటమంగాపురం రోడ్డు గత వారం రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో ఆ మార్గంలో బస్సు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రధాన మార్గం వరకు విద్యార్థులు నడిచి వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలిసి అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఎంహెచ్ఓ తన సొంత నిధులతో రోడ్డుకు మట్టి తోలించి మరమ్మతులు చేయించారు. దీంతో ఆగిన బస్సు రాకపోకలు ఆదివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. గ్రామస్తులు, విద్యార్థులు చంద్రయ్యయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### ఘనంగా ధర్మరాజస్వామి ఉత్సవాలు



నారదుని వేషంలో వాసుదేవయ్య

**రేణిగుంట:** మండలంలోని వెదుళ్లచెరువులోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం అలుగు ఊరేగింపు జరిగింది. మహాభారత ఉత్సవాల్లో భక్తులు కోలాట నృత్యాలు, పండరి భజనలు, హరికథలు, భాగవతం, ద్రౌపదీ వస్త్రాపహరణం, కీచక వధ, రామాంజనేయ యుద్ధం నాటికలను ప్రదర్శించారు. గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో ఏఈ వెదుళ్లచెరువు వాసుదేవయ్య రాత్రి రామాంజనేయ యుద్ధం నాటిక ప్రదర్శనలో నారదుని వేషంలో అలరించారు.



అలుగు ఊరేగింపు

- మేకలు, గొర్రెలకు కాలిపుండ్లు
- ముందుగా గుర్తించకుంటే మందలో మిగిలిన జీవాలకు వ్యాప్తి
- జాగ్రత్తలతోనే నివారణ

# వర్షాకాలం.. వ్యాధుల గాలం!



గొర్రెల మంద

**సత్యవేదు:** వర్షాకాలంలో మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ అప్సర్ సహెద్ సూచించారు.

**నియోజవర్గంలో లక్షకు పైగా మేకలు, గొర్రెలు**

నియోజకవర్గంలోని సత్యవేదు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల పరిధిలో లక్షకు పైగా మేకలు, గొర్రెలు ఉన్నాయి. మేతకు వెళ్లిన మేకలు, గొర్రెల మందలు వర్షాల్లో తడవడం, మురికి కుంటలు, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం ఉండడం వల్ల సూక్ష్మజీవులు వాటి కాళ్లను ఆశించడంతో జీవాలు కాలిపుండ్లు వ్యాధి బారిన పడతాయి. అలాగే చిత్తడి నేలల్లో తిరగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీనిని గుర్తించకుంటే ఒక మేక నుంచి గానీ, గొర్రెకుగానీ వచ్చిన వ్యాధి త్వరగా మందలోని మిగిలిన వాటికి వ్యాపిస్తుంది. ఈ సమస్యను అధిగమించేందుకు సంబంధిత పశుకాపరులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తమ సిబ్బంది, పశు వైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని ఏడీ అప్సర్ సహెద్ సూచించారు.

**వ్యాధి లక్షణాలు ఇలా...**

ఈ వ్యాధి సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనకపడతాయి. సరిగ్గా నడవలేక ఇబ్బందులు పడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలి పుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగ్గా మేత మేయవు. బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పట్టి దుర్వాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంటుంది.

**చికిత్స ఇలా...**

మేకలు, గొర్రెల్లో వ్యాధిని గుర్తిస్తే వెంటనే స్పందించాలి. వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణం లేక 10శాతం మూలతుత్తం ద్రావణం లేదా 5శాతం ఫార్మాలిన్ ద్రావణంలో నడిపంచి వాటి కాళ్లను శుభ్రం చేయాలి. రోజుకు రెండు మార్లు చేయించాలి. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ మందులను నెల రోజులపాటు పూయించాలి. అదనంగా గిట్ట పెరిగి ఉంటే కత్తిరించాలి.

**పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి..**



మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు కాపర్లు పాటించాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలకు దూరంగా మేపాలి. మందను కాసే ప్రదేశాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనల మేరకు మందులు వేయాలి.

–అప్సర్ సహెద్, పశువైద్యశాల ఏడీ సత్యవేదు

### సుప్రీంకోర్టు తీర్పుతో సమానం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

**శ్రీకాళహస్తి:** లోక్‌అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో 251 కేసుల పరిష్కారానికిగాను రూ.23, 25,168 రికవరీ అయింది. న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లోని కేసులు, చెక్‌బౌన్స్, ప్రమాద పరిహార కేసులు, లేబర్ కేసులు, సివిల్ కేసులు వంటివి లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్‌అదాలత్‌తీర్పు అంతిమమన్నారు. అంతకుముందు కోర్టు ఆవరణలో మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. న్యాయమూర్తులు బేబీరాణి, శ్రీనివాస్, న్యాయవాదులు, పలుశాఖల అధికారులు, బ్యాంకు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

**లోక్‌అదాలత్‌లో 217 కేసుల పరిష్కారం**

**సత్యవేదు:** లోక్ అదాలత్‌లో 217 కేసులు పరిష్కరించి రూ.56,15,982 రూపాయలు రికవరీ చేసినట్లు న్యాయమూర్తి వెంకటనాగరాజు తెలిపారు. సివిల్ కేసులు 5కు రూ.7,67,970, బ్యాంకు కేసులు 29కి రూ.43, 27, 652, క్రిమినల్ కేసులు 183 పరిష్కరించి రూ.5,20,360 రికవరీ చేసినట్లు జడ్జి పేర్కొన్నారు. జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నష్టపరిహారం రూ.కోటి చెల్లించాలి

**రేణిగుంట:** ప్రైవేట్ కంపెనీకి చెందిన బస్సులో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళా ఉద్యోగి కుటుంబసభ్యులకు రూ.కోటి, గాయపడిని వారికి రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, కంపెనీలో పనిచేస్తున్న డ్రైవర్లకు పని భారం తగ్గించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు సెల్వరాజు డిమాండ్ చేశారు. రేణిగుంటలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల ఉపాధ్యక్షుడు పండ్ల రాజశేఖర్, గ్రామిక మహిళ నాయకురాలు సత్యశ్రీ, దీప, ఈశ్వరి పాల్గొన్నారు.

### క్రీడా స్ఫూర్తితో రాణించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ రవి

**సత్యవేదు:** క్రీడాకారులు తమకు నచ్చిన క్రీడల్లో సాధన చేస్తూ అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కె.రవి అన్నారు. డీఎస్‌డీఓ శశిధర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ శ్యాప్ సమ్మర్ క్యాంపులో వార్షిక సమ్మర్ శిక్షణ పొందిన 62 మంది విద్యార్థులకు ఎస్.కన్నయ్య(కరాటే మాస్టర్) శిక్షణ ఇచ్చారు. శనివారం ఎంఈఓ కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సత్యవేదు, వరదయ్యపాళెంకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఎంఈఓ–2 ఉష, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎంఈఓ కార్యాలయం ముట్టడి



ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

**కేవీబీపురం:** ప్రభుత్వ బడుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం కేవీబీపురం ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు చేస్తున్న ×మా బడి మాకు కావాలి¤ పోరాటానికి సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు పలకడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు దాశరి జనార్దన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవో బడుల విలీన ప్రక్రియ కారణంగా కేవీబీపురం మండలంలోని 350 మంది దళిత, గిరిజన పేద విద్యార్థులు చదువులకు దూరమైయ్యారని అన్నారు. 117 జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ఎఫ్ఐ, సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత పద్ధతిలోనే ప్రభుత్వ బడులను కొనసాగించాలని కోరుతూ సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించారు. గురుకులకండ్రిగ, అప్పనగుంట, పాతపాళెం, జ్ఞానమ్మ కండ్రిగ, ఎస్ఎల్‌పురం, బంగారమ్మకండ్రిగ, మహదేవపురం, కొట్టాలమిట్ట, తిమ్మసముద్రం గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ



మధుసూదన్‌ను సత్కరిస్తున్న కార్యదర్శులు

**వరదయ్యపాళెం:** మండల డిప్యూటీ ఎంపీడీఓగా మధుసూదన్ శనివారం వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి గ్రామ పంచాయతీ నుంచి పదోన్నతి పొంది బదిలీపై వచ్చినట్లు తెలిపారు. మండలంలో గత రెండేళ్లుగా ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ఎట్టకేలకు ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ సందర్భంగా వరదయ్యపాళెం ఈఓ బసిరెడ్డి, బత్తలవల్లం పంచాయతీ కార్యదర్శి యూసఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు ఆయనను శాలువ, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

**శ్రీకాళహస్తి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన జరగన్ను సార్వత్రిక సమ్మెలో తాముా పాలు పంచుకుంటున్నట్లు శ్రీకాళహస్తి లారీ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ సమ్మెకు సంఘీభావంగా ఆదివారం శ్రీకాళహస్తిలో సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో నాణ్యతలేని భోజనం





నాసిరకంగా ఆలూపై, భోజనాలు వడ్డిస్తున్న విద్యార్థులు

- విద్యార్థులే సర్వర్లు

**రేణిగుంట:** మండలంలోని విమానాశ్రయం సమీపంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. శనివారం మధ్యాహ్నం పరిశీలించగా భోజనంలో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనపడింది. వంటవాళ్లు ముగ్గురే ఉండడంతో విద్యార్థులే వడ్డించే దృశ్యాలు కనపడ్డాయి. ఒకే హాల్లో 300 మంది విద్యార్థులు ఇరుకుగా నేలపై కూర్చొని ఒకేసారి భోజనం చేస్తున్నారు. ప్రిన్సిపల్ హరిబాబును వివరణ కోరగా విద్యార్థులు వడ్డించడం అనేది సర్వ సాధారణమని అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేయడం వల్ల కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవం అన్నారు.

### గడువు పెంచండి

**శ్రీకాళహస్తి:** దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం మీసేవ కేంద్రాలు, సచివాలయ కేంద్రాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. సదరం సర్టిఫికెట్ కావాలంటే అటు మీ సేవలో గానీ, లేదా గ్రామ సచివాలయంలో గానీ నమోదు చేసుకోవాల్సి ఉంది. వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సదరం సర్టిఫికెట్ కోసం దివ్యాంగులు తిరుగుతూనేతున్నారు. ఈనెల 6వ తేదీ చివరి గడువు కావడం, ఆదివారం కావడం వల్ల మీసేవ కేంద్రాలు పనిచేస్తాయో లేదో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలని కోరారు.

### స్మార్ట్ మీటర్లు తొలగించాలి

**శ్రీకాళహస్తి:** సీపీఐ రాష్ట్ర పిలుపు మేరకు పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్లను తొలగించాలని, ఆదానితో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు చేసినటువంటి వాగ్దానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన తెలిపారు. అనంతరం ఈఈ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, రూరల్ మండల కార్యదర్శి మించిల శివకుమార్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, స్ట్రీట్ వెండర్ యూనియన్ నాయకులు మేక జనార్దన్, రైతు సంఘం నేత మల్లెయ్య, వివిధ కార్మిక సంఘాల నయకులు పాల్గొన్నారు.

# కనుల పండువగా ఉత్తర గోగ్రహణం

**శ్రీకాళహస్తి:** స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో శనివారం ఉత్తర గోగ్రహణం కనులపండువగా జరగింది. భారతంలో భాగంగా ఉత్తర గోగ్రహణం ఘట్టాన్ని వేషదారులు ప్రదర్శించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం ద్రౌపదీదేవి పురవిహారం చేశారు. రాత్రి గోవులను మలవేయుట కార్యక్రమంలో భాగంగా అర్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు శనివారం వేకువజామున అలుగు (కుండపై కత్తి నిలుపుట) కార్యక్రమం నిర్వహించారు.

**నేడు అగ్నిగుండ మహోత్సవం**

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు అగ్నిగుండ ప్రవేశం ప్రారంభంకానుంది. ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.



పురవీధుల్లో ఊరేగుతున్న బృహన్నల అవతారంలో అర్జునుడు

# నేడు 'రీకాల్ బాబు మేనిఫెస్టో' పోస్టర్ ఆవిష్కరణ

- విజయవంతం చేయాలని నూకతోటి రాజేష్ పిలుపు



నూకతోటి రాజేష్

**వరదయ్యపాళెం:** గత సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా విస్మరించారని, ఆ హామీలను ప్రజలకు గుర్తు చేసేందుకు గ్రామస్థాయిలో ఇంటింటికీ రీకాల్ బాబు మేనిఫెస్టో కార్యక్రమం చేపట్టనున్నామని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి ఆదివారం సత్యవేదు నియోజకవర్గంలోని నాగలాపురంలో రీకాల్ బాబు మేనిఫెస్టో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు ఉదయం 9గంటలకు నాగలాపురం బైపాస్ రోడ్డులోని గురు కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమం విజయవంతం చేయాలని రాజేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# పాలకవర్గ సమావేశంలో రగడ

**రేణిగుంట:** రేణిగుంట మేజర్ పంచాయతీ పాలకవర్గ సమావేశం శనివారం సర్పంచ్ నగేషం అధ్యక్షతన నిర్వహించారు. ఈఓ మాధవి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు వేతన సవరణపై పాలకవర్గం ఆమోదం తెలిపింది. వార్డు సభ్యులు గత పాలకవర్గ సమావేశాన్ని బహిష్కరించి ఎటువంటి అంశాలను ఆమోదం తెలపలేదని, కానీ అప్పటి ఈఓ, సర్పంచ్ కలిసి సమావేశానికి రాని వారి సంతకాలు తీసుకుని అనేక అంశాలను ఆమోదం తెలపడంపై వార్డు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు, సర్పంచ్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన వార్డు సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. సమావేశం అనంతరం వార్డు మెంబర్లతో సర్పంచ్ రాజీ ప్రయత్నాలు చేయడంతో వార్డు మెంబర్లు తాత్కాలికంగా రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. తదుపరి కార్యాచరణను ఒకటి, రెండు రోజుల్లో తెలుపుతామని ఈసందర్భంగా వార్డు సభ్యులు తెలిపారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని కైలాసగిరి కాలనీలో శనివారం వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సురా సురేష్ బాబాయి సురా బాలచంద్ర మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. పగడాల రాజు, శరవణకుమార్, కంఠా ఉదయ్, మున్నారాయల్, జీవీకే రెడ్డి పాల్గొన్నారు.

### నివాళి



నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

**ఏర్పేడు:** ఏర్పేడు మండలం సీతారాంపేట గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అక్కుపల్లి లోకేష్ యాదవ్ చిన్నమ్మ అక్కుపల్లి లక్ష్మి మృతిచెందడంతో శనివారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు.

### నేడు ట్రాఫిక్ ఆంక్షలు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తిలో ధర్మరాజస్వామి తిరునాళ్లు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం అగ్నిగుండ ప్రవేశం జరగనుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ ఆంక్షలు విధిస్తున్నట్లు చెప్పారు. పిచ్చాటూరు నుంచి వచ్చే వాహనాలు ఆర్‌సీపీ వద్ద, సత్యవేదు నుంచి వచ్చే వాహనాలు ఎంజీఎం ఆస్పత్రి వరకు మాత్రమే అనుమతిస్తున్నట్లు చెప్పారు. ధర్మరాజస్వామి ఆలయం వైపు వాహనాలకు అనుమతి లేదన్నారు. శ్రీకాళహస్తిలో పోలీస్‌యాక్ట్ 30 అమలు చేస్తున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. సభలు, సమావేశాలు ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు లేవన్నారు. ఎవరైనా నిర్వహించాలనుకుంటే ముందస్తు అనుమతులు తీసుకోవాలని చెప్పారు.

# కాలం చెల్లిన మాత్రల విక్రయంపై చర్యలు



మందులు, రికార్డులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

**సత్యవేదు:** మందుల షాపులో కాలం చెల్లిన మాత్రలు విక్రయంపై చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి అన్నారు. శనివారం ఆమె సత్యవేదులోని పల్లావు వీధిలో నిర్వహిస్తున్న ఎస్ఎస్ మందుల షాపును తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులను శోభారాణికి విక్రయించిన విషయం వాస్తవమేనని ఆమె తెలిపారు. ఎస్ఎస్ నేచురల్ కూర్ క్లినిక్ నడుపుతున్న ఆర్ఎంపీ వైద్యుడు సోమశేఖర్ సిఫార్సుతో రోగికి మెడికల్ షాపులో మందులు ఇచ్చారన్నారు. శోభారాణి మందుల డేట్ గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. మందుల షాపులో అల్లోపతి, ఆయుర్వేద మందులు కూడా విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. జిల్లా అధికారులకు సమగ్ర నివేదిక అందించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

**వరదయ్యపాళెం:** కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం వరదయ్యపాళెంలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు చంద్ర, ఆశా వర్కర్ యూనియన్ నాయకురాలు వాణి, భవన నిర్మాణ కార్మిక అధ్యక్షులు కోటేశ్వరరావు, నాయకులు హైమావతి, దామోదరం పాల్గొన్నారు.

### టేబుల్ టెన్నిస్ కోర్టు ప్రారంభం



కోర్టును ప్రారంభిస్తున్న డీఎస్పీ

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం టేబుల్ టెన్నిస్ కోర్టును డీఎస్పీ నరసింహమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం తీగల వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీపీఐ వందేళ్ల చరిత్ర అజరామరం

–సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి



మాట్లాడుతున్న మురళి

**శ్రీకాళహస్తి:** సీపీఐ వందేళ్ల చరిత్ర అజరామరమని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. శనివారం శ్రీకాళహస్తి రూరల్ మండలం ముళ్లపూడి శాఖ మహాసభ బత్తెమ్మ అధ్యక్షతన జరిగింది ఆయన మాట్లాడుతూ సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా అన్ని శాఖల్లో వంద జెండాలు నాటి ఉత్సవాలు జరపాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు స్వచ్ఛందంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం కార్యదర్శి జనమాల గురవయ్య రూరల్ కార్యదర్శి మించల శివకుమార్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత తొట్టంబేడు మండల కార్యదర్శి శ్రీనివాసులు, ముళ్లపూడి ఎస్టీ కాలనీ శాఖ కార్యదర్శి బత్తెమ్మ పాల్గొన్నారు.